కథ

# కొండయ్యమ్మ

సలీం



"తొందరగా తయారవ్వు. మనం గాజులు కొనడానికి నగల షాపుకెళ్తున్నాం" అన్నాను.

సంగీత విస్మయంగా నా వైపు చూసింది. "డబ్బులెక్కడివి? గాజులు కొందామని దాస్తూ వచ్చిన డబ్బు మొన్న బాబిగాడి అనారోగ్యమప్పుడు హాస్పిటల్‌కి ధారపోశాంగా"

"ఏం చేస్తాం చెప్పు. నేనా చిరుద్యోగిని. పెళ్ళయి ఐదేళ్ళు కావస్తున్నా నీకో జత బంగారు గాజులు కొనలేని అసమర్థుణ్ణి"

"అయ్యో అలా అనబాకండి. మనం మన శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నాంగా. మన కనీసావసరాల్ని కూడా తగ్గించుకుని డబ్బు దాయటం... మహమ్మారిలా ఏదో ఓ అవసరం ముంచుకొచ్చి దాచుకున్న డబ్బుల్ని మింగేయడం. మొదట మీ అమ్మగారి అనారోగ్యం... మన పెళ్ళి... అత్తగారి చావు... బాబిగాడి డెలివరీ అప్పటి ఖర్చు... యింట్లో ఎవరో ఒకరికి అనారోగ్యం... దిగులు పడకండి. నాకా గాజులమీద మోజు చచ్చిపోయింది"

"అందుకే ఈరోజు చిట్టీ పాడాను. పది నెల్లనుంచీ చిట్టి కడ్తున్నానని చెప్పాగా"

"ముందే పాడేసుకుంటే నష్టం కదండీ" సంగీత సింగారించుకుంటూ అంది. అలా అందేకాని ఆమె మొహంలో అద్భుతమైన వెలుగు... ఉప్పొంగుతున్న సంతోషం... ఆడవాళ్ళకి బంగారానికి ఏదో ఆత్మీయమైన అనుబంధం ఉండి ఉంటుంది.

మరో నాలుగడుగులు వేస్తే నగలషాపు వచ్చేస్తుందనుకునే లోపల ముగ్గురు వ్యక్తులు మాకడ్డుగా నిలబడ్డారు. "అక్కయ్యా. బావగారికి సెప్పి ఓ పద్రూపాయలిప్పించు" తప్పించుకు వెళ్ళబోతున్న సంగీత వెంట పడ్డారు. నేను జేబులోంచి పది రూపాయలు తీసి వాళ్ళ చేతికిచ్చాను. "బావ శానా మంచోడు" నా బుగ్గలు పుణికి ముందుకెళ్ళారు.

"ఛీ పాడు. రోడ్డుమీద మిమ్మల్ని ఎలా చేశారో చూడండి. ఐనా మీరెందుకు డబ్బులిచ్చారు? విదిలించుకుని వచ్చేయవచ్చుగా" అంది సంగీత.

"అందరూ వాళ్ళని చీదరించుకుని విదిలించుకుంటే వాళ్ళు బతికేదెలా"

సంగీత మరోసారి నా వైపు విస్మయంగా చూసింది. "కొజ్జా వాళ్ళ మీద అంత జాలి పడేవాళ్ళని మిమ్మల్నే చూస్తున్నాను"

"ప్లీజ్. ఆ పదం వాడకు. వాళ్ళని తిట్టినట్లు, అవమానించినట్లనిపిస్తుంది"

"సరే. మరేమని పిలవను?చూడు పిన్నమ్మా టైపననా? జాకోలననా? బృహన్నలంటే మరింత గౌరవంగా ఉంటుందేమో" సంగీత నవ్వింది. "ఎలా పిలిచినా విషయమైతే మారదుగా. ఐనా ఇలా రోడ్డున పోయేవాళ్ళని ఇబ్బంది పెట్టి డబ్బులు అడుక్కోకపోతే కాయకష్టం చేసుకోవచ్చుగా. వాళ్ళ ముగ్గుర్నీ గమనించారా? అంతంతెత్తున... చీరలు రవికలు తొడిగిన దున్నపోతుల్లా ఉన్నారు"

"మిగతావాళ్ళ గురించి నాకు తెలీదు. నువ్వు మాత్రం నా భార్యగా వాళ్ళ గురించి చులకనగా మాట్లాడకు. నాకు బాధనిపిస్తుంది. పైకి అలా దురుసుగా ప్రవర్తిస్తున్నా దేవుడు తమని మగా ఆడా కాకుండా పుట్టించినందుకు లోపల ఎంతగా కుమిలిపోతుంటారో మనకేం తెలుసు? పొట్టకూటికోసం రకరకాల మార్గాలు...వీళ్ళు ఎన్నుకున్న బతుకు తెరువు ఇది. ఐనా ఇందాక చూసిన ముగ్గురూ నిజంగా మూడోజాతి వ్యక్తులు కాకపోవచ్చు కూడా. మగవాళ్ళే చీరలు చుట్టుకుని ఇలా రోడ్డుమీద అసభ్యంగా ప్రవర్తిస్తూ డబ్బులు సంపాయించే అవకాశాలున్నాయి"

సంగీత ఏమీ మాట్లాడలేదు. ఏం మాట్లాడినా నేను నొచ్చుకుంటాననుకుందేమో...

మంచి డిజైన్ ఉన్న రెండు జతల బంగారు గాజులు తీసుకుంటున్నప్పుడు సంగీత సంభ్రమంగా "ఒక్క జతేగా కొనాలనుకున్నాం. రెండు జతలగాజులా...నాకేగా... గాల్లో తేలుతున్నట్లుందండీ" అంది.

'ఇంటికెళ్ళాక చెప్తాలే" అన్నాను ముక్తసరిగా.

ఇంటికి తిరిగిరాగానే "గాజులు వేసుకుని చూపించనా" అంది.

"సరే. ఒక జత మాత్రమే నీకోసం. మరో జత గాజులు మరొకరికోసం కొన్నాను" అన్నప్పుడు సంగీత మూడోసారి నావైపు విస్మయంగా చూసింది.

"మరొకరికోసమా? ఎవరికోసం?"

"నేను కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరికి మాటిచ్చాను. ఇన్నాళ్ళకు నేనిచ్చిన మాట నిలుపుకోబోతున్నాను. రేపే మనం ఒంగోలు వెళ్తున్నాం"

"ఒంగోలా... అక్కడ మనవాళ్ళు ఎవరున్నారు? నాకు తెలిసి మీ బంధువుల్లో నా బంధువుల్లో లేరే"

"బంధువులే ఉండాలా... ఆత్మబంధువులు ఉండకూడదా?"

"ఓ... అలా చెప్పండి. ఆడా మగా? పిచ్చి ప్రశ్న కదూ. గాజులు

ఆడాళ్ళకేగా ఇచ్చేది" తన వెడల్పాటి కళ్ళు అల్లరిగా తిప్పి కన్ను గీటుతూ అంది.

"తెలీదు"

"ఏం తెలీదు?"

"ఆడో మగో తెలీదు"

"మీరు పజిల్స్ వేస్తే విప్పేంత తెలివిలేదు గానీ చెప్పండి ఎవరో"

"నిజంగానే తెలీదు. దేవుడు రచించే పజిల్స్ విప్పడం ఎవరితరం"

"అబ్బబ్బ. చంపకండి. కనీసం పేరు చెప్పండి"

"కొండయ్యమ్మ"

"పేరు చిత్రంగా ఉందే. కొండయ్య అనైనా ఉండాలి లేదా కొండమ్మ అనైనా ఉండాలిగా. కొంపదీసి మీరు చెప్పిన మూడో జాతా?"

"కొండయ్యమ్మది నేటి రోజుల్లో మృగ్యమైపోతున్న మనిషి జాతి. మంచితనం, మానవత్వం మనసు నిండా నింపుకున్న మానవజాతి" అన్నాను.

** ** **

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. రేపు ఒంగోలు వెళ్ళబోతున్నామన్న ఆలోచనకే మనసు ఉద్విగ్నతకు లోనౌతోంది. కొండయ్యమ్మ... నా ఇంటర్మీడియట్ చదువు... ఎన్నెన్ని జ్ఞాపకాలో... దొంతర్లు దొంతర్లుగా... పొరలు పొరలుగా చుట్టుకుని...

ఒంగోలు శర్మా కాలేజీలో సీటు రావడమంటే సామాన్యమైన విషయం కాదు. అందునా నాలాంటి పల్లెటూరి అబ్బాయికి. సీటొచ్చినా దిక్కుతోచని పరిస్థితి నాది.

అమ్మా నాన్న వ్యవసాయ కూలీలు. పేర్నమిట్టలో వూరి చివర పూరిపాక తప్ప ఏ ఆధారమూ లేని బతుకులు... రెండేళ్ళ క్రితం అనారోగ్యంతో నాన్న చనిపోయినప్పుడు 'నేనింక చదువుకోనమ్మా. నీతోపాటు కూలికొస్తాను" అన్నాను. అమ్మ కళ్ళలో దిగుళ్ళ ఆకాశం చూశానప్పుడు.

"ఈ కట్టం నీకొద్దురా.బాగా సదూకో. నా సేతుల్లో సత్తువ ఉన్నంత కాలం నీ సదువుకి అడ్డంకి రాదు. నువ్వు పేద్ద సదువులు సదివి దొరబాబులా ఉజ్జోగం సేస్తా ఉంటే సూడాలని ఉందిరయ్యా" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

అందుకే ఎన్ని కష్టాలెదురైనా సరే ఇంటర్మీడియెట్‌లో చేరడానికే నిశ్చయించుకున్నా. మావూరి మోతుబరి చెంచయ్యగారి మూడో అబ్బాయి రామం ఒంగోల్లో సంతపేట దగ్గర రూం తీసుకుని శర్మా కాలేజీలోనే ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతన్ని బతిమాలుకుని, కాళ్ళా వేళ్ళా బడి రూంలో ఉచితంగా ఉండటానికి అనుమతి సంపాదించాను. ఇక మిగిలింది భోజన సదుపాయం... మొదట వంట చేసుకోవాలనుకున్నాను. కానీ పిడికెడు జొన్నలు కొనడానికి కూడా గతిలేనోణ్ణి. ఏంచేయాలో పాలుపోక ఒకట్రెండు రోజులు పస్తులున్నాను.

"తిండికోసం ఎందుకు అగచాట్లు పడ్తావు? కొండయ్య మెస్సుందిగా. నాతోపాటు రా. పరిచయం చేస్తాను" అన్నాడు రామం.

"మెస్సా... వండుకోడానికే ఇబ్బందులు పడ్తుంటే మెస్సు బిల్లు ఎలా కట్టగలను?నా పేదరికాన్ని ఎగతాళి చేయకు" అన్నాను బాధగా.

"ఛా. నువ్వు మనూరోడివి. నీ సంగతి నాకు తెలీదా? ఆ మెస్సుకి డబ్బు కట్టాల్సిన అవసరం లేదు. ఫ్రీ. నేనే ఫ్రీగా తింటున్నాను మరి నిన్నెవరు డబ్బులడుగుతారు?

నాకు చాలా ఆశ్చర్యమేసింది. ఈ రోజుల్లో ఉచితంగా భోజనాలు పెట్టేవాళ్ళున్నారా? నమ్మశక్యం కావట్లేదు.

అతనితోపాటు నడుస్తూ "ధర్మసత్రమా" అని అడిగాను.

"నీ బొంద. ఈ రోజుల్లో ధర్మసత్రాలెక్కడ ఏడ్చినాయ్. మామూలు మెస్సే.ఎటొచ్చీ కొండయ్య అదో టైపు" అన్నాడు వంకరగా నవ్వుతూ.

మేం వెళ్ళేటప్పటికి హాల్లో పదిమందిదాకా కుర్రాళ్ళు కూచుని ఉన్నారు. మేమూ వాళ్ళ పక్కనే కూచున్నాం. పదేళ్ళ పిల్ల కంచాలు తెచ్చి మా ముందు పెట్టి వెళ్ళింది.

"కొండయ్య కూతురు" అంటూ కిసుక్కున నవ్వాడు రామం.


కొద్దిసేపటి తర్వాత ఆ పిల్లే వచ్చి కూరలు, పప్పు వడ్డించింది. ఆ పిల్ల వెనకే ఒకతను వేడిగా పొగలు కక్కుతున్న అన్నాన్ని వెడల్పాటి గిన్నెలో పెట్టుకుని వచ్చాడు.

చాలా ఎత్తుగా బలిష్ఠంగా ఉన్నాడతను. చామనచాయ... గడ్డం మీసాలు షేవ్ చేసుకున్నదానికి ఆనవాళ్ళుగా నల్లటిచార... మగవాడే-కానీ చీర, రవిక కట్టుకుని ఉన్నాడు. మెడలో బంగారు గొలుసు... చెవులకు దుద్దులు... కుడిచేతికున్న మట్టిగాజులకు అటూ ఇటూ రెండు బంగారు గాజులు... ఎడం చేతికి ఆడవాళ్ళ రిస్టువాచీ... నడకలో కులుకు...

అతనే కొండయ్య" అన్నాడు రామం. అతని గొంతులో స్పష్టంగా తొణుకుతున్న చులకనభావం.

అన్నం వడ్డిస్తున్న కొండయ్యతో ఒక కుర్రాడు "నిన్నెలా పిలవాలో

ఒంగోలు శర్మా కాలేజీలో
సీటు రావడమంటే
సామాన్యమైన
విషయం కాదు. అందునా నాలాంటి
పల్లెటూరి అబ్బాయికి. సీటొచ్చినా
దిక్కుతోచని పరిస్థితి
నాది. అమ్మా నాన్న
వ్యవసాయ కూలీలు.
పేర్నమిట్టలో వూరి చివర
పూరిపాక తప్ప ఏ ఆధారమూ లేని
బతుకులు... రెండేళ్ళ క్రితం
అనారోగ్యంతో నాన్న చనిపోయినప్పుడు
'నేనింక చదువుకోనమ్మా. నీతోపాటు
కూలికొస్తాను" అన్నాను.
అమ్మ కళ్ళలో
దిగుళ్ళ ఆకాశం చూశానప్పుడు.



తెలీటం లేదు కొండయ్యా. నువ్వు చెప్పు. నీకెలా పిలిపించుకోవటం ఇష్టం? కొండయ్యా అనా కొండమ్మా అనా"

"మీ ఇష్టం బాబూ. మీరెలా పిల్చినా పలుకుతాను" నవ్వుతూ అంటున్న కొండయ్య మొహంలో దుఃఖఛాయల కోసం వెతుక్కున్నా. ఎంత నిర్మలత్వం... ఎంత స్వచ్ఛమైన నవ్వు... మనసులో ఏ కల్మషమూ లేనోళ్ళే పసిపాపల్లా అంత హాయిగా నవ్వగలరు.

"కొండయ్యకు కొద్దిగా పిచ్చిలే. మనల్నెలా తన పిల్లలని అనుకుంటాడో ఈ చెట్లనీ, పూలనీ, మొక్కల్ని కూడా తన సొంత పిల్లల్లా చూసుకుంటాడు. ఇలాంటి సెంటిమెంట్స్ ఉండబట్టేకదా నాలాంటి వాళ్ళ పబ్బం గడిచేది" అన్న రామం వైపు అసహ్యంగా చూశాను.

తనకు అన్నం వడ్డిస్తున్నప్పుడు రామం నా వైపు చూపించి, "కొండయ్యా. ఈ అబ్బాయిది మావూరే. నాన్నలేడు. మా నాన్నలానే వీళ్ళమ్మ కూడా పొలాల్లో కూలి పనికెళ్తుంది. ముందే చెప్తున్నా. డబ్బులిచ్చుకోలేడు" అన్నాడు.

"మీకెన్నిసార్లు చెప్పాను బాబూ... అన్నం తినేటప్పుడు డబ్బుల విషయం మాట్లాడొద్దని... నేనడిగానా? మీరు కడుపునిండా తృప్తిగా తినండి. నాకదే చాలు. డబ్బులంటారా... ఇవ్వగలిగితే ఇవ్వండి లేకపోతే లేదు. నాకు చాతనైనంతకాలం మీలాంటి పిల్లలకు అన్నం పెట్టి తృప్తిపడతాను. ఏజన్మలో ఏ పాపం చేసుకున్నానో ఈ జన్మలో దేవుడు నన్నిలా పుట్టించాడు. నా కడుపున పిల్లలు పుట్టే అదృష్టం లేకున్నా మిమ్మల్నే నా పిల్లలనుకుంటాను" కొండయ్య కళ్ళలో తడి...

నా కంచంలో అన్నం వడ్డిస్తూ "నీ పేరేమిటి బాబూ" అంటున్న కొండయ్య గొంతు మగదే. కానీ తల్లిప్రేమలోని లాలిత్యాన్ని పొదువుకున్న గొంతు...

"రమణ" చాలా లోగొంతుకతో సమాధానమిచ్చాను.

"మొహమాటపడకు నాయనా. నీక్కావల్సినంత తిను. అడిగి మరీ వేయించుకో. ఇది మీ ఇల్లే అనుకో. నన్ను మీ అమ్మ అనుకో. మీరందరూ తల్లిదండ్రుల్ని వదిలి చదువుకోసం కదా ఇంత దూరం వచ్చారు. బాగా చదువుకోండి. ఏ కష్టమొచ్చినా కడుపులో పెట్టుకుని కాపాడుకోడానికి నేనున్నానని మర్చిపోకండి" అంటూ వంగుని వడ్డిస్తున్న కొండయ్య నిటారుగా నిలబడ్డాడు.

తలయెత్తి చూస్తే ఎంత ఎత్తుగా ఉన్నాడో... ఆజానుబాహువు... మొహంలో వెల్తురు పూయిస్తున్న కాంతిపుంజం... అతని చేతిలోని గుండ్రటి స్టీలు గిన్నె విష్ణుమూర్తి చేతిలోని చక్రంలా... నా కళ్ళకు కొండయ్య విశ్వరూపాన్ని చూపుతున్న కృష్ణ భగవానుడిలా...

అతని మాటల్లోని ఆత్మీయతకు, హృదయంలోని ఆర్ద్రతకు నా కళ్ళు చెమర్చాయి. పరిపూర్ణమైన స్త్రీ హృదయాన్ని మగ శరీరంలో దాచుకున్న వ్యక్తి కొండయ్య అన్పించింది.

అన్నాలు తినడం పూర్తయ్యాక మరలా ఆ పదేళ్ళ పిల్ల వచ్చి కంచాలు తీసుకెళ్ళింది.

చేతులు కడుక్కోడానికి పెరట్లో ఉన్న బావి దగ్గరకెళ్ళినపుడు చూశాను. ఇంటిచుట్టూ అందమైన తోట. రకరకాల పూలమొక్కలు... కూరగాయల మొక్కలు... అరటిపాదు... జామచెట్టు... ఎటు చూసినా అలలుగా కదుల్తోన్న పచ్చదనం...

"అబ్బ. ఎంతందమైన తోట" అనాయాసంగానే వచ్చిందా మాట.

"కొండయ్యకు కొద్దిగా పిచ్చిలే. మనల్నెలా తన పిల్లలని అనుకుంటాడో ఈ చెట్లనీ, పూలనీ, మొక్కల్ని కూడా తన సొంత పిల్లల్లా చూసుకుంటాడు. ఇలాంటి సెంటిమెంట్స్ ఉండబట్టేకదా నాలాంటి వాళ్ళ పబ్బం గడిచేది" అన్న రామం వైపు అసహ్యంగా చూశాను.

"మీ నాన్న మోతుబరి. మా అమ్మలాంటి ఎంతోమంది కూలీలు మీ పొలాల్లో పని చేస్తారు. మరెందుకు కొండయ్యతో అబద్ధం చెప్పావు?" కోపంగా అడిగాను.

"నేనేంటి ఈ మెస్‌లో తినేవాళ్ళలో సగానికి పైగా ఏదో ఒక అబద్ధం చెప్పి నెలల తరబడి ఫ్రీగా మెక్కుతున్నవాళ్ళే"

"అంత మంచి వ్యక్తిని మోసం చేయటం తప్పుకదా"

"మోసమా గాడిదగుడ్డా... నిజాయితీగా మెస్‌కి బిల్లు కట్టేస్తే నా సరదాలకీ, సినిమాలకీ షికార్లకీ డబ్బులెక్కడ నుంచి వస్తాయి? ఇదిగో రమణా ముందే చెప్తున్నా. పాపంలే పేదవాడివని రూంలో చోటిచ్చా. కొండయ్యకు నిజం చెప్పావో రూంలోంచి గెంటేస్తా" అంటూ బెదిరించాడు.

ఓ రోజు రాత్రి భోజనాల తర్వాత కుర్రాళ్ళందరూ కబుర్లలో పడ్డారు.

"అసలు కొజ్జావాళ్ళంటే ఎవరు?" అని అడిగాడొకడు.

"అదేం చచ్చు ప్రశ్న? ఆడా మగా కానివాళ్ళు"

"అదేరా. అంటే ఏమిటని?"

"కొన్ని ఆడ లక్షణాలు మరికొన్ని మగ లక్షణాలు కలిసి..."

"అబ్బ అదికాదురా. అక్కడ... ఎలా ఉంటుందని?"

"ఏమో నాకెలా తెలుస్తుంది? నేనేమైనా చూశానా ఏమిటి"

"కొండయ్యనడిగి చూద్దామా" అన్నాడొకడు పెద్దగా నవ్వుతూ.

"వాళ్ళు ఆడపిల్లల్ని తెచ్చి పెంచి పెద్దచేశాక వాళ్ళచేత వ్యభిచారం చేయిస్తారటగా"

"ఔనట. అందుకేనేమో కొండయ్య ఓ అనాథ పిల్లని తెచ్చి పెంచుకుంటున్నాడు"

నాకు చాలా కోపం వచ్చింది. ఆదరించి అన్నం పెడ్తున్న కొండయ్య గురించి అలా మాట్లాడుకుంటున్న వాళ్ళ నాలుకలు చీరేయాలన్నంత కోపం...

"వీళ్ళు మగ పిల్లల్ని ఎత్తుకొచ్చి వాళ్ళని కూడా కొజ్జాలుగా మారుస్తారట కదా"

వాళ్ళని వదిలించుకుని విసవిసా దూరంగా నడిచాను.

"రమణ ముందు కొండయ్యనేమీ అనబాకండిరా. వీడు కొండయ్య అభిమాని" రామం నా వెనక ఎగతాళిగా అనటం విన్పించింది.

అప్పుడే నిర్ణయించుకున్నాను...రామం నన్ను గెంటేసినా సరే వీళ్ళ బాగోతాలు అమాయకంగా మోసపోతున్న కొండయ్యకు చెప్పాల్సిందేనని. మరునాడు కాలేజీ వదలగానే రూంకెళ్ళకుండా కొండయ్య దగ్గరకెళ్ళాను.

నేను వెళ్ళే సమయానికి కొండయ్యా ఆ అమ్మాయి హాల్లో కూచుని కూరలు తరుగుతున్నారు. నన్ను చూడగానే "రా బాబూ... కూచో" అంటూ గోడవారగా ఉన్న కుర్చీ చూపించాడు.

"వద్దు. నేనూ మీతోపాటు కింద కూచుంటా" అని గోడకానుకుని కూచున్నాను.

"ఏంబాబూ... ఏదైనా అవసరమా ఈ సమయంలో వచ్చావు? పర్లేదు చెప్పు. నేను తీర్చగలిగినదైతే తప్పకుండా తీరుస్తాను" అన్నాడు కొండయ్య. వెన్నెలంత చల్లదనం ఆ మాటల్లో...

"అలాంటిదేంలేదు. వూరికే రావాలనిపించి..." నీళ్ళు నమిలాను. ఎలా చెప్పాలో తెలీని పరిస్థితి... "కొండయ్యా...ఈ అమ్మాయి నీదగ్గరకెలా వచ్చింది" ఏదో ఒకటి మాట్లాడాలని అడిగాను.

కొండయ్య పుచ్చపువ్వు విచ్చుకున్నట్లు నవ్వాడు. "దీనిపేరు సుజాత. అప్పుడు దీనికి మూడేళ్ళ వయసుంటుంది. విజయవాడ రైల్వేస్టేషన్లో ఏడుస్తూ కన్పించింది. నన్ను చూడంగానే ఏడుపు ఆపేసి నవ్వుతూ "అమ్మా" అంది. ముచ్చటేసి డబ్బులివ్వబోతే తీసుకోలేదు. చాక్లెట్లు కావాలా అని అడిగితే తల అడ్డంగా వూపింది. ఆకలేస్తోందా అన్నం కావాలా అని అడిగితే నవ్వి "అమ్మ కావాలి" అంది. నా గుండె చెరువైందంటే నమ్ము. ఎత్తుకుని స్టేషనంతా తిరిగినా ఆ అమ్మ కన్పించలేదు. ఎవరో కావాలనే వదిలేసి వెళ్ళి ఉంటారు. నా అదృష్టం అనుకుని ఇంటికి తెచ్చుకున్నాను.

తన కుడిచేతిలోని బంగారు గాజులు చూపిస్తూ, "ఈ గాజులంటే నాకు చాలా ఇష్టం తెలుసా. ఇవి మా అమ్మవి. పాతబడిపోయినా అదే బంగారాన్ని కరిగించి మరికొంత బంగారం వేసి దిట్టంగా చేయించుకున్నా. నా తర్వాత ఈ గాజులు నా ఈ తల్లికే తెలుసా" అంది సుజాత వైపు మురిపెంగా చూస్తూ.

ఇంత మంచి మనసున్న కొండయ్యని మోసం చేస్తున్న రామం,

మిగతా కుర్రాళ్ళు గుర్తొచ్చి, "కొండయ్యా. ఓ విషయం చెప్తా... బాధ పడవుగా" అన్నాను.

"చెప్పు బాబూ"

"నీ మెస్‌లో తింటున్న చాలామంది కుర్రాళ్ళు డబ్బులిచ్చే తాహతు ఉండికూడా నీకేవో మాయమాటలు చెప్పి ఎగ్గొడ్తున్నారు. నా రూమ్‌మేట్ రామం వాళ్ళ నాన్న మావూరి మోతుబరి. ఇంటినుంచి నెలనెలా డబ్బొస్తుంది. కానీ నీతో పేదవాడినని చెప్పి మోసంచేస్తు న్నాడు. వాడొక్కడే కాదు నీమెస్‌లో తింటున్న చాలామంది నీతో అబద్ధాలు చెప్తున్నారు తెలుసా"

కొండయ్య కొన్ని క్షణాలు స్తబ్దుగా కూచున్నాడు. నిజాల్ని జీర్ణించు కోలేకపోతున్నాడనుకున్నా. నావైపు దీర్ఘంగా చూసి "తెలుసు" అన్నాడు. ఆశ్చర్యపోవడం నా వంతయింది.

"అన్నం పెట్టమని నా యింటికొచ్చే పిల్లల దగ్గర డబ్బులు తీసుకోవ డమే తప్పనిపిస్తుంది. అందుకే అడగను బాబూ. వాళ్ళిచ్చినా ఇవ్వ కున్నా అన్నం పెడ్తూనే ఉంటాను. మీ అందరికీ అన్నం వండి వడ్డించడం నాకో ఆదాయ మార్గం కాదు. నా తృప్తి కోసమే. పిల్లలు అబద్ధాలు చెప్తున్నారో నిజాలు చెప్తున్నారో తల్లికి తెలీదా? పిల్లల తప్పుల్ని మన్నించి గుండెల్లో దాచుకోకపోతే నేను తల్లినెలా అవు తాను?" అన్నాడు కొండయ్య.

అప్పటివరకూ నాకు అమ్మలా కన్పించిన కొండయ్య ఆ క్షణంనుంచీ అమ్మలందరికీ ఆదర్శప్రాయమైన అమ్మలా ఎదిగిపోయి కన్పించాడు.

ఇది జరిగిన నెల్లాళ్ళకు మా వూరి నుంచి ఉత్తరం వచ్చింది. అమ్మ కు ఆరోగ్యం బాగోలేదట. మనసంతా దిగుళ్ళ పుట్టలా మారి పిచ్చిగా రోడ్లు పట్టుకు తిరిగా. మా వూరెళ్ళటానికీ సరిపడా డబ్బులు కూడా లేవు. అమ్మకెలా ఉందో... చిన్నచిన్న అనారోగ్యాలైతే మా అమ్మ నాకు ఉత్తరం రాయించదని తెలుసు. నా చదువు పాడౌతుందని అమ్మ భయం... అమ్మను చూడనివ్వకుండా అడ్డుకుంటున్న పేదరికం మీద విపరీతమైన కోపం వచ్చింది. పేదలను పుట్టించిన దేవుడి మీద కూడా...

తిరిగి తిరిగి అలసిపోయి టైం అడిగితే తొమ్మిది దాటిందని తెల్సింది. అప్పుడు గుర్తొచ్చింది ఆకలి... కాళ్ళీడ్చుకుంటూ కొండయ్య మెస్ కెళ్ళాను. వది కావస్తోంది. కొండయ్య మేలుకునే ఉన్నాడు. నన్ను చూడగానే మొహం సంతోషంతో విప్పారింది. "రా బాబూ... అందరూ వచ్చినా నువ్వు రాలేదని ఎదురుచూస్తూ కూచున్నాను. నీ కోసమని అన్నం తీసిపెట్టి ఉంచాను" అంటూ నా ముందు కూచుని కంచంలో అన్నం పప్పూ కూరా వడ్డిస్తుంటే ఏడుపు తన్నుకు వచ్చింది.

"ఎందుకేడుస్తున్నావు?" అన్నాడు కంగారుపడిపోతూ కొండయ్య.

"మా అమ్మ గుర్తొచ్చింది. నేనిక్కడ వరన్నం... మంచి మంచి కూరలు... పప్పు తింటున్నాను. అక్కడ మా అమ్మ పూటకింత జొన్న సంగటైనా తింటుందో లేదో? కనీసం కడుపుకింత అంబలైనా దొరుకు తుందో లేదో? మా అమ్మకు ఆరోగ్యం బాగాలేదట. ఉత్తరం వచ్చింది. చదువు మానేసి మా వూరెళ్ళిపోదామనుకుంటున్నాను" అన్నాను కన్నీళ్ళని తుడుచుకుంటూ.

"ఇలాంటప్పుడే ధైర్యంగా ఉండాలి. మీ అమ్మ కష్టపడ్తుందే నీ చదువు కోసం. దాన్ని మానేస్తానం టావేమిటి? బాగా చదువుకుని పెద్ద ఉద్యోగస్థుడి వైనాక మీ అమ్మను సుఖపెట్టు. సంపాదనాపరుడి వైనాక అమ్మ కోసం ఏంచేస్తావు చెప్పు?" అని అడిగాడు.

"మా అమ్మకు రోజూ ఇలా తెల్లటి మల్లెపువ్వు లాంటి వరన్నం పెడ్తాను. పప్పు, రకరకాల కూరల్తో రుచికరంగా భోజనం పెడ్తాను"

"అంతేనా... ఇంకా"

"మేమ్యుంటున్న గుడిసె తప్ప మరోలోకం తెలీదు మా అమ్మకు. అందుకే ఇలాంటి అందమైన ఇల్లు కట్టించి, చుట్టూ తోట పెంచి మా అమ్మకు కానుక గా ఇస్తాను"

"అదీ పట్టుదలంటే. ఎన్ని కష్టాలెదురైనా ఈ గమ్యాన్ని మర్చి పోవద్దు" అంటూ ఉత్సాహపరిచాడు కొండయ్య. అన్నం సయించటం లేదంటే బతిమాలి కొసరి కొసరి తిన్పించాడు.

చేయి కడుక్కుని వెళ్ళబోతుంటే ఆపి నా చేతిలో వంద రూపాయల కాగితం పెట్టాడు.

"నీ మెస్‌లో ఫ్రీగా అన్నం పెడ్తుంది చాలక ఈ డబ్బులేమిటి" అన్నాను.

"పర్లేదు. తీసుకో. మీ వూరెళ్ళి అమ్మకు నయమైనాకే రా"

నాకు మరలా కన్నీళ్ళు వరదలా వచ్చాయి. అప్పుడు అమ్మ గుర్తొచ్చి ఏడుపొస్తే ఇప్పుడు కొండయ్యలోని అమ్మతనం తట్టుకోలేక ఏడు పొచ్చింది. "నీకు చాలా రుణపడిపోతున్నాను కొండయ్యా" అన్నా ను వణికే గొంతుతో.

"తల్లీ బిడ్డల మధ్య రుణాలేమిటి? నాకు సుజాత ఎంతో నువ్వూ అంతే" అన్నాడు కొండయ్య.

అప్పుడే నేనో నిర్ణయానికొచ్చాను. వూరెళ్ళి అమ్మ ఆరోగ్యం కుదుట పడేవరకు ఉండి తిరిగొచ్చాక- కొండయ్య వద్దన్నా వినకుండా ప్రతి పనిలో అతనికి సహాయపడటం ప్రారంభించాను. మార్కెట్‌కెళ్ళి కూర గాయలు తీసుకురావడం... పచారీ షాపుకెళ్ళి సరుకులు కొనుక్కుని రావడం... కూరలు తరగడం... భోజనాలు వడ్డించడం... కంచాలు కడగటం... అందరూ తిని వెళ్ళిపోయాక మేం ముగ్గురం కూచుని భోంచేసే వాళ్ళం.

ఓ రోజు ఉడకబెట్టిన బంగాళాదుంపల్ని నేనూ సుజాత వలుస్తూ కూచున్నాం. కొండయ్య చక్కగా సింగారించుకుని "బైటికెళ్దాం. తోడు రా రమణా" అని పిల్చాడు. సరుకులు కొనడానికేమోననుకున్నా. కాదు. నేరుగా నగల షాపుకి పిల్చుకెళ్ళాడు. తన చేతికున్న రెండు బంగారు గాజులు తీసిచ్చి, "వీటిని అమ్మితే ఎంతొస్తుందో చెప్పండి" అన్నాడు షావుకారితో. ఆ గాజులంటే కొండయ్యకెంతిష్టమో నాకు తెలుసు.

డబ్బులు తీసుకుని తిరిగి వస్తున్నప్పుడు అడిగాను. "అవి మీ అమ్మ గాజులు. ఎందుకమ్మావు కొండయ్యా"

"ఏంచేయను బాబూ. సరుకులు కొనడానికి డబ్బులు మిగలటం లేదు. అలాగని నా యింటికి భోజనానికొచ్చే పిల్లల్ని డబ్బులడిగి ఇబ్బంది పెట్టలేను. అందుకే..."

"అందుకా ఈ మధ్య నీ మెడలో ఉండాల్సిన గొలుసు కన్పించటం లేదు. తీసి బీరువాలో దాచి ఉంటావనుకున్నాను. అదీ అమ్మేశావ న్నమాట"

కొండయ్య ఇబ్బందిగా నవ్వాడు.

"నిజంచెప్పు. గాజులమ్ముతున్నప్పుడు బాధనిపించలేదూ"

"ఎందుకన్పించదూ... బంగారం అంటే ఇష్టపడని ఆడది ఉంటుం దా? గొలుసమ్ముతున్నప్పుడు అంతగా అన్పించలేదుగానీ... ఈరోజు గాజులమ్ముతుంటే... " ఓ క్షణం ఆగి "నాకా గాజులంటే చాలా ఇష్టం" అన్నాడు.

"నాకు ఉద్యోగం వచ్చాక డబ్బులు దాచిపెట్టి నీకో జత బంగారు గాజులు కొంటాను కొండయ్యా"

అతని పక్కగా నడుస్తున్న నన్ను అమాంతం దగ్గరకు లాక్కుని, "నా బాబే... అంత మాటన్నా వు చాలు" నా బుగ్గలు పుణుకుతూ అన్నాడు.

**"బైటికెళ్దాం. తోడు రా రమణా" అని పిల్చాడు. సరుకులు కొనడానికేమోననుకున్నా. కాదు. నేరుగా నగల షాపుకి పిల్చుకెళ్ళాడు. తన చేతికున్న రెండు బంగారు గాజులు తీసిచ్చి, "వీటిని అమ్మితే ఎంతొస్తుందో చెప్పండి" అన్నాడు షావుకారితో. ఆ గాజులంటే కొండయ్య కెంతిష్టమో నాకు తెలుసు.**

** ** **

కర్నూలు సిల్వర్ జూబ్లీ కాలేజీలో డిగ్రీ సీటొచ్చింది. భోజనం, వసతి అంతా ప్రభుత్వమే భరిస్తుందని తెలిసి కొండయ్య సంతోషపడ్డాడు.

శెలవల్లో పేర్నమిట్టకొచ్చి తిరిగి వెళ్ళేటప్పుడు తప్పకుండా కొండయ్యని కల్సుకునేవాణ్ణి. ఎంత వారించినా వినకుండా నా చేతిలో వందో రెండొం దలో పెట్టేవాడు.

(మిగతా 29వ పేజీలో)

# కొండయ్యమ్మ

**(11వ పేజీ తరువాయి)**

"ఎందుకు కొండయ్యా... అవసరంలేదు. ఖర్చు లేం ఉండవు. అంతా గవర్నమెంటే చూసుకుంటుంది" అంటే- "గవర్నమెంటోడి తిండి తింటున్నావు... సరే... మరి ఈ అమ్మ కష్టార్జితం కూడా తినాలిగా బాబూ" అనేవాడు.

డిగ్రీ కాగానే హైద్రాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం దొరికింది. అమ్మను పిల్చుకుని హైద్రాబాద్ వెళ్ళేముందు కొండయ్యయింటికెళ్ళాను.

"రమణా. నా మెస్‌లో కొన్ని వందల మంది కుర్రాళ్ళు తిని పోయి ఉంటారు. కానీనువ్వంటే నాకో ప్రత్యేకమైన ఇష్టం ఏర్పడింది. ఎందుకో తెలుసా" అని అడిగాడు.

"నేను పేదవాణ్ణని"

"కాదు. చాలామంది పేదపిల్లలు నా మెస్‌లో తిని ఉంటారు. అందరూ అన్నం పెడ్తున్న నావైపు కుతూహలంగా చూసినోళ్ళే. వాళ్ళ చూపులో చులకన భావం... నేను పక్కకు తిరగంగానే ఎగతాళిగా నవ్వుకున్న వాళ్ళే. వాళ్ళ చూపులు, చేష్టలు గుండెల్లో ఎన్ని గాయాలు చేసినా తల్లిలా భరించాను తెలుసా. నువ్వొక్కడివే నావైపు కృతజ్ఞతగా చూశావు. ప్రేమగా చూశావు. ఓ తల్లిని పిల్లాడు చూసే చూపు. అందుకే నువ్వు నా స్వంత బిడ్డలా అన్పిస్తావు" అంటూ కౌగిలించుకుని కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

హైద్రాబాద్‌లో ఉద్యోగంలో చేరాక వెంటవెంటనే వచ్చిపడిన సమస్యలు... అమ్మ అనారోగ్యం... చావు... పెళ్ళి... పిల్లాడు... ఉద్యోగం పోవటం... మరో ఉద్యోగం కోసం వెతుకులాట... నాలుగు ఉద్యోగాలు మారాను. గాజుల కోసం డబ్బులు దాచటం మాత్రం మానలేదు. జమ చేయటం- ఏదో ఓ అవసరానికి ఖర్చు చేయటం... మరలా దాచటం... పెళ్ళయిన ఐదేళ్ళకి చిట్‌ఫండ్ పుణ్యమా అంటూ గాజులు కొనగలిగాను.

** ** **

బస్సు ఒంగోలు చేరేప్పటికి ఉదయం ఆరైంది. రిక్షా చేసుకుని సంత పేటకు బయల్దేరాను. కొండయ్య నన్ను చూడగానే ఆశ్చర్యానందాల్లో మునిగిపోతాడు. నేను తెచ్చిన గాజులు చూసి తప్పకుండా మురిసిపోతాడు. అతని కళ్ళలో ఆ వెల్తురు చూడాలన్న కోరిక తొందర పెడ్తుంటే రిక్షా చాలా నెమ్మదిగా పోతున్న భావన...

తలుపు తడ్తున్నప్పుడు గుండె ఎంత వేగంగా కొట్టుకుందో... సుజాత తలుపు తీసింది. ఆమెకు పెళ్ళయిన గుర్తుగా మెడలో మంగళసూత్రం. అలికిడికి ఆమె భర్త హాల్లోకొచ్చాడు. పరిచయాలైనాక "కొండయ్య ఏడీ? ఇంకా నిద్ర పోతున్నాడా?" అని అడిగాను.

సుజాత కళ్ళలో నీళ్ళుప్పిల్లాయి. "అమ్మ చనిపోయి ఏడాది దాటింది. నువ్వెక్కడున్నావో తెలీలేదు. కబురు అందించడానికి శత విధాలా ప్రయత్నించాను" అంది ఏడుస్తూనే.

నాకూ ఏడుపు ఆగింది కాదు.


"ఇప్పుడే వస్తానుండు" అని సుజాత లోపలికెళ్ళి వచ్చింది. "అమ్మ చనిపోయేముందు వీటిని నీకిమ్మని కోరింది. ఇన్నాళ్ళుగా నీ రాక కోసమే ఎదురుచూస్తున్నా"అంటూ నా చేతిలో దస్తావేజులు పెట్టింది.

"ఏమిటివి?"

"ఇలాంటి ఇల్లు కట్టుకుని మీ అమ్మను అందులో ఉంచాలనేది నీ కోరికని అన్నావటగా. అందుకే అమ్మ ఈ ఇంటిని సగం నీకు, సగం నాకు రాసింది. వాటికి సంబంధించిన దస్తావేజులవి"

వరదలా పొంగుకొస్తున్న దుఃఖాన్ని ఎలా ఆపాలో తెలీక ఆ దస్తావేజులతో పాటు నేను తెచ్చిన బంగారు గాజుల్ని సుజాత చేతుల్లో పెట్టి భోరుమని ఏడ్చాను.

●




## వృద్ధాప్యంలో పదిమందికి తోడ్పడుతున్నారా?

**జీ**వితంలో అరవై ఏళ్ళు ఒక మైలురాయి.

ఒక ప్రశాంత చిత్తంతో బతికే సమయం.

వృత్తివ్యాపకాల్ని విరమించి విశ్రాంతి నొందే సందర్భం.

వృద్ధాప్యం సహజంగా, అనివార్యంగా తటస్థించిన సన్నివేశం.

అయినా...

కాలాన్ని కరిగించడం ఒక్కటే ధ్యేయం కాదు.

జీవితం ముగిసిన సందర్భం అసలే కాదు.

నిజానికి కాలాన్ని నవనవోన్మేషంగా ఉపయోగించుకునే వేళ ఇది.

జీవనసంధ్యలో జీవితాన్ని మరింత ఉత్సాహంగా గడపటం సాధ్యమే.

సాధ్యమేనని నిరూపిస్తున్నవారు మన చుట్టూరా ఎందరో వున్నారు.

అందుకే ఉద్యోగ విరమణ చేశాక మీరేం చేస్తున్నారు? మీరు చేస్తున్న పనులు చుట్టూ వున్న పదిమందికి ఉపకరిస్తున్నాయా? ఇతరులకు చేదోడువాదోడుగా వుంటున్నారా? పొద్దు గడపటానికి ఏదో ఒక పని చేయడం మామూలే. కానీ మీరు చేసే పనులు ఇతరులకు ఏవిధంగా సహాయకారిగా వుంటున్నాయో ఆలోచించారా? కొన్నిసార్లు మాటసాయం కూడా గొప్ప సహాయంగా వుంటుంది. అందువల్ల మీరు చేసే పనులు, సేవా కార్యక్రమాలు సమాజంలో పదిమందికి ఎలా ఉపకరిస్తున్నాయో మాకు రాసి పంపించండి. మీ కుటుంబసభ్యులకయినా మీరు ఏవిధంగా తోడ్పడుతున్నారో కూడా రాయొచ్చు. మీ అనుభవాల్ని ఈ 'జీవనసంధ్య' శీర్షికలో ప్రచురిస్తాం.

ఎందుకంటే మీ అనుభవాలు అరవై ఏళ్ళు పైబడిన ఇతరులకు కూడా ఉపకరిస్తాయి. వృద్ధాప్యాన్ని బరువుగా, భారంగా కాకుండా ఆనందంగా, సృజనాత్మకంగా గడపటం ఎలానో తెలుసుకుంటారు. కనుకనే అరవై ఏళ్ళు పైబడిన వారు ఇప్పుడు ఎలా గడుపుతున్నారో ఈ శీర్షికకు రాసి పంపించండి.

మీరు ఒంటరిగా వుంటున్నా, మీ బిడ్డల వద్ద వుంటున్నా లేక వృద్ధుల శరణాలయాల్లో వుంటున్నా మీరు ఎలా గడుపుతున్నారో రాసి పంపించండి. మీ పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం మరవద్దు.

**మా చిరునామా:**
**జీవనసంధ్య**
**ఆదివారం వార్త**
**ఎడిటర్, వార్త**
**లోయర్ టాంక్‌బండ్**
**హైదరాబాద్-500 080**